క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం

బొబ్బిలి/బొబ్బిలి రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ ఆసరా పథకం నగదు పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అల్లు భాస్కరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పల నాయుడు పాల్గొనే ఈ కార్యక్రమానికి మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు హాజరు కావాలని ఆయన కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో బొద్దాం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన విజ్ఞాన వేదిక సభ్యులు శోభకృత్ నామ తెలుగు సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, కమిటీ సభ్యులు రామినాయుడు, రాజు, సత్యం, అప్పలరాజు, రామలింగం, పద్మ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం



నగదు పురస్కారం అందుకున్న విద్యార్థులతో పట్టణ ప్రముఖులు

బొబ్బిలి: స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో కళాభారతి వ్యవస్థాపకుడు ఎస్‌వీజీ కృష్ణ స్వామి సంస్మరణ సభ శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా గతేడాది పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు మున్సిపల్ మాజీ చైర్మన్ తూముల అచ్యుతవల్లి చేతులమీదుగా నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర నాయకుడు రౌతు రామమూర్తినాయుడు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం

బాడంగి: మండల కేంద్రంలో శని, ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో భయంతో ఇళ్లకే ప్రజలు పరిమితమయ్యారు. ఈ వర్షం పంట సాగుకు అనుకూలమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ప్రతీ విద్యార్థి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, పుస్తక పఠనం ద్వారా మంచి జ్ఞానం వస్తుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో ఆయన విద్యార్థులతో వివిధ పుస్తకాలను చదివించడం, బొమ్మలు వేయించడం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల్లో ప్రతీ ఆదివారం చేపట్టే చదవడం మాకిష్టం కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగి, తద్వారా మంచి జ్ఞానం లభిస్తుందన్నారు.

గ్రామసభ



సోషల్ ఆడిట్ వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌పీ రామకృష్ణ

రాజాం: మండలంలోని వీఆర్ అగ్రహారంలో ఆదివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో గత నాలుగు రోజులుగా సోషల్ ఆడిట్ బృందం ఉపాధి హామీ పనుల నిర్వహణపై చేపట్టిన ఆడిట్ వివరాలను సభలో వెల్లడించారు. ఈ పంచాయతీలో 18 పనులకు సంబంధించి, జరిగిన రూ.35 లక్షల ఖర్చుపై తనిఖీలు జరిగినట్లు డీఆర్‌పీ రామకృష్ణ తెలిపారు. పనుల్లో ఏవైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి. శంకరరావు, ఏపీఓ సాయిరాం పాల్గొన్నారు.

బాడంగిలో 'చదవడం మాకిష్టం'

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ లైబ్రరీకి వచ్చిన విద్యార్థులతో పుస్తకాలు, నీతికథలు చదివించడంతో పాటు కంప్యూటర్ వినియోగం పట్ల అవగాహన కల్పించారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ సురేంద్రనాయుడు

రామభద్రపురం: నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సురేంద్రనాయుడు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండల పరిధిలోని పాత నేరస్తులు, ఇప్పటికే రౌడీషీట్లు తెరిచిన వారితో ఆయన ఆదివారం సమావేశమై, కౌన్సిలింగ్ ఇచ్చారు. ఏ విధమైన నేరాలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని హెచ్చరించారు.

ఆధ్యాత్మిక పరిమళాలు..

- రామభద్రపురం, వంగరలోని కొప్పరలో ఘనంగా ఆలయాల ప్రారంభోత్సవం
- ఎస్.చింతలవలసలో గరగాలమ్మ పండగ సందడి
- రేగిడిలోని దేవుదలలో ఆధ్యాత్మిక దివ్య మహాసభ
- సంతకవిటిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం
- బొబ్బిలిలో ముస్లింల రంజాన్ ఉపవాస దీక్షలు



రామభద్రపురంలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో కలశాలలతో మహిళలు

రామభద్రపురం: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న భక్తిపారవశ్య కార్యక్రమాలతో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో కొత్తగా నిర్మించిన ఈశాన్యేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వరుసగా శని, ఆదివారం జరగ్గా, భారీ సంఖ్యలో భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని, దైవం పట్ల తమ భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. మహిళలంతా కలశాలలతో తీసుకువచ్చిన పవిత్ర నదీజలాలతో ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేశారు. అంతకుముందు స్వామి వారి విగ్రహాలను వీధుల్లో ఊరేగించారు. ఇదిలా ఉండగా, మండలంలోని నరసాపురం గ్రామంలో ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలంతా కలశాలలతో గ్రామ సమీపంలోని ఏడు వంపుల గెడ్డ దగ్గరకు వెళ్లి, అక్కడి నుంచి తీసుకువచ్చిన నీటితో శివపార్వతుల విగ్రహాలకు మంగళస్నానం చేశారు. అనంతరం ప్రత్యేకాభిషేకాలు, కుంకుమ పూజలు చేపట్టారు.

నేటి నుంచి గరగాలమ్మ పండగ..

మండలంలోని సోంపురం పంచాయతీ, ఎస్.చింతలవలస గ్రామంలో సోమవారం నుంచి గరగాలమ్మ గ్రామదేవత పండగ నిర్వహించనున్నారు. దాదాపు మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించి, అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రోజుకో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో గ్రామానికి బంధువులు, యాత్రికులు, పర్యాటకులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. జాతర మహోత్సవంలో పాల్గొనే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు చెబుతున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ..

వంగర: మండలంలోని కొప్పర గ్రామంలో కొత్తగా నిర్మించిన కనకదుర్గమ్మ ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వడ్డి శివుడు, వడ్డి బోడియ్య, వడ్డి వేణు సంయుక్తంగా నిర్మించిన ఈ ఆలయానికి గ్రామస్తులు సహాయ సహకారాలు అందించారు. ప్రధానార్చకులు వేమకోటి మన్మథరావు, భోగాపురపు సీతారామస్వామి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ చేసిన తర్వాత మహిళలు అమ్మవారికి ముర్రాటలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

పరులకు ఉపయోగపడేలా జీవించాలి..

రేగిడి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని పాలకొండకు చెందిన సత్యసాయి భక్తుడు, ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని దేవుదల గ్రామంలో వెలసిన గీతామందిరంలో ఆధ్యాత్మిక దివ్య మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు ఇతరులకు ఫలాలు ఇచ్చి ఉపయోగపడుతున్నాయని, నదులు ప్రవహిస్తూ జీవరాశికి నీరందిస్తూ ఉపయోగపడుతున్నాయని, గోవులు కూడా పాలిచ్చి పరోపకారం చేస్తున్నాయని తెలిపారు. మానవుడు కూడా పరుల మంచికి ఉపయోగపడేలా జీవించాలని అలా చేస్తే భగవంతుని ముక్తి మార్గం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వక్త గొర్లె దామోదరరావు, నిత్యాస్మరణానంద స్వామి తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలో తలతంపర గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బొద్దాం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లడంతో పాటు దుకాణాలకు వెళ్లి, త్రైత సిద్ధాంతం గొప్పతనం వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, సభ్యులు రామినాయుడు, రాజు, సత్యం, అప్పలరాజు, రామలింగం, పద్మ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు..

బొబ్బిలి: పట్టణంలోని జామియా మసీదు ఆవరణలో ముస్లింలంతా ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఆరగించారు. రంజాన్ నెల కావడంతో ముస్లింలంతా ఉపవాస దీక్షలు చేపట్టారు. ఈ నేపథ్యంలో వేకువజాము నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉండి, ప్రత్యేక నమాజ్‌ల తర్వాత విందు స్వీకరిస్తారు. దీక్షలు చేపట్టి, ఆదివారం నాటికి మూడు రోజులు కాగా మసీదుల దగ్గర ముస్లిం సోదరుల సందడి నెలకొంది.

రేగిడి: స్థానిక విశ్వసాయి మందిరంలో 108 మంది సత్యసాయి భక్తులంతా హనుమాన్ చాలీసా పారాయణం ఆదివారం చేశారు. కార్యక్రమంలో జిల్లా బాలవికాస్ ఇన్‌చార్జ్ అరుణకుమారి, రాజాం డివిజనల్ యూత్ కో–ఆర్డినేటర్ రాజు, రేగిడి భజన మండలి కన్వీనర్ శివప్రసాద్, బాలవికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.



రామభద్రపురం: నరసాపురంలో ఉమారామలింగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహానికి మంగళస్నానం



రామభద్రపురం: రాగి బిందెలతో పవిత్ర నదీజలాలు తీసుకువస్తున్న మహిళలు



సంతకవిటి: తలతంపర గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారంలో కమిటీ సభ్యులు



వంగర: కనకదుర్గమ్మకు పూజలు చేస్తున్న మహిళా భక్తులు



రామభద్రపురం: ఎస్.చింతలవలసలో ఉత్సవాలకు ముస్తాబైన గరగాలమ్మ ఆలయం



రేగిడి: భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ



బొబ్బిలి: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం సోదరులు



రేగిడి: హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

సంక్షేమ క్యాలెండర్ ప్రకారమే నిధుల జమ



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సంక్షేమ పథకాల క్యాలెండర్ ప్రకారమే లబ్ధిదారుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు జమ చేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, మెప్మా, వెలుగు శాఖల అధికారులతో ఆదివారం సమావేశమైన ఆయన ఈ ఏడాది వైఎస్సార్ ఆసరా పథకం కింద బొబ్బిలి మున్సిపాలిటీలోని దాదాపు 10 వేల మంది మహిళలకు రూ.5.76 కోట్లు, మండలంలోని 14 వేల మంది మహిళలకు రూ.8.02 కోట్ల నిధులు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి, సీఎం జగన్ సందేశం వినిపిస్తామన్నారు. మండల, పట్టణ పరిధిలోని అధికారులు, నాయకులు, డ్వాక్రా మహిళలకు వేర్వేరుగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ రేజేటి ఈశ్వరరావు(విసు), ఏపీఎం స్వామి, టీపీఆర్ఓ జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 3న వాహనాల వేలం

వంగర: రాజాం ఎస్ఈబీ కార్యాలయంలో ఏప్రిల్ 3వ తేదీన వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు అదేరోజు ఎస్ఈబీ కార్యాలయానికి రావాలని కోరారు.

ఏప్రిల్ నెలాఖరుకు గొడౌన్ నిర్మాణం పూర్తి



మండల కేంద్రంలో గొడౌన్ నిర్మాణానికి వేసిన పునాది

మెంటాడ: మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో గొడౌన్ నిర్మాణ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. రైతులు తమ పంటలను నిల్వ చేసుకునేందుకు వీలుగా దాదాపు రూ.36 లక్షల నాబార్డు నిధులతో గొడౌన్ నిర్మిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ తాడ్డి రామచంద్రరావు తెలిపారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి గొడౌన్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

అన్నదానం

బొబ్బిలి: స్థానిక బైపాస్ దగ్గర దాడితల్లి ఆలయ గోపుర పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

నటుల సంకల్పంతోనే నాటక పునరుజ్జీవం

రాజాం సిటీ: నటులు సంకల్పిస్తే నాటకం పునరుజ్జీవం దాల్చుతుందని ప్రముఖ పండితుడు, కవి నేతేటి గణేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ స్కూల్‌లో జరిగిన రాజాం రచయితల వేదిక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన 'కాళ్లకూరి వారి కమనీయ దృశ్య కావ్యాలు' అనే అంశంపై కాసేపు ప్రసంగించారు. రచయిత కాళ్లకూరి నారాయణరావు రాసిన నాటకాలతో తెలుగు సమాజంలో సంఘ సంస్కరణ భావాలు ప్రచారంలోకి వచ్చాయన్నారు. చారిత్రక కథలను తన కాలంనాటి సంఘ ప్రయోజనానికి సాంఘిక నాటకాలుగా మలిచి రచించిన గొప్ప రచయిత నారాయణరావు అని కొనియాడారు. అనంతరం వేదిక సభ్యులు గణేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో వేదిక నిర్వాహకులు గార రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు పాటించాలి



బొబ్బిలి: ర్యాలీలో గ్రీన్ బెల్ట్ సొసైటీ సభ్యులు



రామభద్రపురం: కొవ్వొత్తుల వెలుగులతో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బొబ్బిలి: స్థానిక పట్టణంలో ఎర్త్ అవర్ కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ వాసులు, గ్రీన్ బెల్ట్ సొసైటీ సభ్యులంతా సేవ్ ఎర్త్, సేవ్ లైఫ్ నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి మాట్లాడుతూ అవసరం లేనప్పుడు, రాత్రి సమయంలో చల్లగా ఉన్నప్పుడు విద్యుత్ బల్బులు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, ఫ్యాన్లు ఆఫ్ చేసి విద్యుత్ పొదుపు పాటించాలని కోరారు.

రామభద్రపురం: ఎర్త్ అవర్ సందర్భంగా మండల కేంద్రంలో ఉపాధ్యాయులు, సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహ విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. భూ పరిరక్షణే ధ్యేయంగా పర్యావరణంతో పాటు నేల, నీరు, గాలి కాలుష్యం కాకుండా చూడాలని, అలాగే నీటిని, విద్యుత్‌ను పొదుపు చేయాలని కోరారు. రాబోయే తరాల వారికి విద్యుత్ వెలుగులు ప్రసాదించేందుకు ఇప్పటినుంచే ప్రతిరోజూ రాత్రి 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ఓ గంట పాటు విద్యుత్ ప్రసారం ఆపివేసి, విద్యుత్‌ను పొదుపు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.రవికుమార్, జి.ముసలయ్య, ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

అవినీతిలో చంద్రబాబు దిట్ట

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: ప్రజలను మోసం చేయడంలోనూ, పథకాల పేరిట ప్రజాధనం దోచుకోవడంలోనూ చంద్రబాబు సిద్ధహస్తుడని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు విమర్శించారు. స్కాం (అవినీతి)ల్లో కూడా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మంచి దిట్ట అని దీనికి యువతకు ఉపాధి శిక్షణ పేరుతో ఆయన పాల్పడిన స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమే ఉదాహరణన్నారు. ఆదివారం మండలంలోని కొండవలస గ్రామంలో విలేకరులతో మాట్లాడిన వారు.. నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసిన ఘనచరిత్ర చంద్రబాబునాయుడుదేనన్నారు. స్కిల్ డెవలమెంట్ కోసమని సీమెన్స్ వాటా రూ.3,300 కోట్లు కాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.371 కోట్లు చంద్రబాబు తన కంపెనీల ద్వారా ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. నిధుల విడుదలపై ఆనాడే ఆర్థిక శాఖ అధికారులు గగ్గోలుపెట్టినా వినకుండా డబ్బులు విడుదలకు ఒత్తిడి చేస్తూ చంద్రబాబు ఫైల్ పంపారన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు బటన్ నొక్కగానే ప్రభుత్వ ఖాతా నుంచి అటు, ఇటు తిరిగి ఆయన ఖాతాలోకే డబ్బులు చేరుకునేవన్నారు. రాజధాని ప్రాంతమని చెప్పి, అమరావతిలోని వెలగపూడిలో తాత్కాలిక సచివాలయ భవనాన్ని నిర్మించిన చంద్రబాబు మరో భారీ స్కాంకు తెరతీశారన్నారు. ఇటువంటి స్కాంలు చేయడంలో చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్యేనని ఎద్దేవా చేశారు. రాష్ట్ర అభివృద్ధిని పక్కనబెట్టి, ఆయన అభివృద్ధి కోసమే తపన పడిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న రాష్ట్ర అభివృద్ధిని చూసి, ఓర్వలేక ఆయన లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మడం లేదన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లోనూ మళ్లీ సీఎం జగన్‌నే ముఖ్యమంత్రిగా ఎన్నుకునేందుకు జనం సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ టి.అచ్చెన్నాయుడు, రాజాం మండల పార్టీ అధ్యక్షుడు ఎల్.రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బి.నర్సింహులు పాల్గొన్నారు.

ఎన్.ఎమ్.ఎమ్.ఎస్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా



జి.దేవిశ్రీప్రసాద్



వి.కార్తీక్



హేమంత్‌కుమార్



పి.మౌనిక



ఎ.రామ్‌కుమార్

తెర్లాం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్.ఎమ్.ఎమ్.ఎస్) పరీక్ష ఫలితాల్లో మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటారు. పెరుమాళి ఆదర్శ పాఠశాల, ఉద్దవోలు, తెర్లాం జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి మొత్తం ఐదుగురు విద్యార్థులు ఈ జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో పెరుమాళి ఆదర్శ పాఠశాలకు చెందిన గేదెల దేవిశ్రీప్రసాద్, వెంపడాపు కార్తీక్, తెర్లాం పాఠశాలకు చెందిన గేదెల హేమంత్‌కుమార్, ఉద్దవోలు పాఠశాలకు చెందిన పెద్దింటి మౌనిక, అమరాపు రామ్‌కుమార్ ఉన్నారు. వీరందరికీ మూడేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనాలు అందనున్నాయి. తమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎన్.ఎమ్.ఎమ్.ఎస్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంపై సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బందితో పాటు ఎంఈఓ త్రినాధరావు కూడా సదరు విద్యార్థులను అభినందించారు.

ఆనందరావు సేవలు మరువలేనివి



ఆనందరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే జోగులు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: ప్రముఖ సంఘ సేవకుడు, మిథునం సినిమా నిర్మాత డాక్టర్ ముయిద ఆనందరావు సమాజానికి చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని వావిలవలస గ్రామంలో ఆనందరావు సంతాపసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎ.ఎం.ఆర్ ఫౌండేషన్ ద్వారా ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే కాకుండా విద్య, వైద్యం అందించేందుకు, విద్యార్థులకు మేధాశక్తి పెంపొందించేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. అంతకుముందు ఆనందరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించిన సదరు నేతలు ఆనందరావు భార్య పద్మిని, తల్లి సీతమ్మ, సోదరుడు శ్రీనివాసరావు, సర్పంచ్ ముయిద ప్రసన్నలక్ష్మి, వారి కుమారులను కలిసి పరామర్శించారు. పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహన్‌రావు, పాలవలస దవళేశ్వరరావు, ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు, రాజాం ఎంపీపీ లావేటి రాజగోపాలనాయుడు, రాజాం జెడ్పీటీసీ బండి నర్సింహులు, పొట్నూరు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

సంతకవిటి: మండలంలోని మందరాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1987–88 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి తీపిజ్ఞాపకాలు నెమరువేసుకుని, ఆనందంగా గడిపారు. మధ్యాహ్నం విందు ఆరగించి, సాయంత్రం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో ఎ.దామోదరరావు, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు రమణారావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

చెరువు గర్భాల సరిహద్దులు గుర్తించండి



నెమలాంలో సరిహద్దుల గుర్తింపును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం కింద గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వేలో చేపడుతున్న సరిహద్దుల గుర్తింపులో చెరువుల గర్భాల సరిహద్దులను పక్కాగా గుర్తించాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు తెలిపారు. మండలంలోని నెమలాం, విజయరాంపురం, జె.కొత్తవలస గ్రామాల్లో జరుగుతున్న భూముల సరిహద్దుల గుర్తింపును ఆదివారం పరిశీలించిన ఆయన నెమలాంలో సచివాలయ సర్వేయర్లకు పలు సూచనలు, సలహాలు చేశారు. రైతుల భూములతో పాటు, ప్రభుత్వ భూములు, చెరువు గర్భాల సరిహద్దులు కూడా గుర్తించాలన్నారు.